# సాక్షి ప్రకాశం

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025




### స్టడీ సర్‌కిల్

కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు శిక్షణ కరువైంది. బీసీ స్టడీ సర్కిల్ నిరుపయోగంగా ఉంది. - 8లో..



### నీళ్ల బాధలు..ఇంకెన్నాళ్లు

ఎన్ఎస్‌పీ కారుమంచి మేజర్ కాలువకు పడిన గండిని వెంటనే పూడ్చాలని డిమాండ్ చేస్తూ రైతులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. - 8లో..

### వాతావరణం

గరిష్టం/కనిష్టం 34 /24

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు

## న్యూస్‌రీల్

### బధిరుల, దివ్యాంగుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఓబులేశు

ఒంగోలు వన్‌టౌన్: బధిరులు, దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ ఓబులేశు తెలిపారు. ప్రపంచ సంకేత భాష, బధిరుల దినోత్సవాన్ని ఒంగోలు ప్రభుత్వ బధిరుల రెసిడెన్షియల్ స్కూల్లో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌ఓ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో 4 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంచాలకులు సీహెచ్ సువార్త, ప్రభుత్వ బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మజ, ఎస్‌కేఆర్ డెఫ్ పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌కే అంజిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండీకాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నా సత్యనారాయణ, జిల్లా బధిరుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజేంద్ర పాల్గొన్నారు.

### టంగుటూరు టోల్ ప్లాజా నిర్లక్ష్యం




టోల్ ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

టంగుటూరు: జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు టోల్ ప్లాజా వద్ద రాత్రి పగలు తేడా లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టంగుటూరు టోల్ ప్లాజా వద్ద మంగళవారం సాయంత్రం మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. జాతీయ రహదారి అధికారులు వాహనదారుల వద్ద అధిక లోడు ఫీజు వసూలు చేయటానికి తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా టోల్ ప్లాజాకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాల కౌంటర్ల వద్ద ట్రాఫిక్ జాం అవుతోంది. ముఖ్యంగా కాలేజీ బస్సులు, అంబులెన్సులు, ద్విచక్రవాహనాలు బాగా ఇబ్బందిపడుతున్నారు. కార్ల కౌంటర్లు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. టోల్ ప్లాజా అధికారులు పాత పద్ధతిని కొనసాగించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. పరిష్కారం చూపాల్సిన టోల్ ప్లాజా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

# ఆశలు కూల్చేస్తూ.. కలలు చెరిపేస్తూ..

జగనన్న కాలనీల పేరు మార్పుపై ఉన్న శ్రద్ధ కాలనీల్లో మౌలిక వసతులు కల్పనపై కూటమి ప్రభుత్వానికి కరువైంది. పేదల సొంతింటి కలనెరవేర్చేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేశారు. ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా కాలనీల్లో కనీస సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వం పేదింటి కలను చెరిపేసేందుకు పూనుకుంటోంది. ఏడాదిన్నర కాలంలో కాలనీల్లో కనీస వసతులు కల్పించలేదు సరికదా పలు కాలనీల్లో విద్యుత్ పరికరాలు వెనక్కి తీసుకెళ్లిపోతుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాడు విద్యుత్ వెలుగుల్లో వెలిగిన కాలనీలు వెలవెలబోతున్నాయి.

నాడు



మార్కాపురంలో విద్యుత్ వెలుగులతో జగనన్న కాలనీ (ఫైల్)

నేడు



పామూరు మండలం గుమ్మనంపాడు లేఔట్‌లో కరెంటు స్తంభాలపై సామగ్రిని తీసుకెళ్తున్న విద్యుత్ సిబ్బంది

- పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించేందుకు వైఎస్సార్ సీపీ చర్యలు
- జిల్లాలో సుమారు 68 వేల మంది పేదలకు మేలు జరిగేలా చర్యలు
- ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి
- జగనన్న కాలనీలను నిర్వీర్యం చేసే పనిలో కూటమి ప్రభుత్వం
- చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కాలనీలపై చిన్నచూపు
- పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగని కాలనీల విద్యుత్ పరికరాల తొలగింపునకు చర్యలు
- ప్రభుత్వ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సాక్షి నెట్‌వర్క్:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 643 జగనన్న కాలనీలు ఏర్పాటయ్యాయి. 67,966 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. అందులో 28,557 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, 39,409 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి వస్తే ఒక్కో ఇంటికి రూ.4 లక్షలు చేస్తామని, అప్పటి వరకు ఇళ్లు కట్టుకోవద్దని చంద్రబాబు అండ్‌కో నమ్మబలికింది. అధికారంలోకి వచ్చిన తరువాత పేదలు ఇంటి నిర్మాణం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసిన దాఖలాల్లేవు. జగన్న కాలనీల పేర్లు మాత్రం మార్చేసింది.

**అనర్హత పేరుతో ఏరివేత..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హౌసింగ్ పథకం కింద ఒక్క గృహం కూడా మంజూరు కాలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాల్లో అనర్హులు ఉన్నారన్న సాకుతో రెవెన్యూ అధికారులతో సర్వే చేయించింది. ఇళ్లు నిర్మించుకోనివారి ఇళ్ల పట్టాలు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అధికార పార్టీ నేతల ఒత్తిడిల మేరకు అధికారులు వేలాది పట్టాలు రద్దు చేశారు.

**నాడు విద్యుత్ వెలుగులు:**

జిల్లాలోని 643 జగన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతోపాటు లే అవుట్లలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసింది. దీంతో జిల్లలోని పలు కాలనీలు రాత్రి సమయాల్లో విద్యుత్ కాంతుల్లో సర్వాంగ సుందరంగా వెలిగిపోయాయి. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం సక్రమంగా జరగని లేఅవుట్లు గుర్తించి వాటిలో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలను తొలగించాలని చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో పేదవాని సొంత ఇంటి కలపై నీళ్లు చల్లారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం రోడ్డు లో ఆక్వా కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ కండక్టర్ చోరీ తో పాటు ట్రాన్స్‌ఫారంను అధికారులు తొలగించిన దృశ్యం

**విద్యుత్ పరికరాల తొలగింపు..**

ఇళ్ల నిర్మాణం సక్రమంగా జరగని లేఅవుట్లలో విద్యుత్ పరికరాలు తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు విద్యుత్ పరికరాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన పరికరాలు, కండక్టర్‌తో పాటు ట్రాన్స్‌ఫారాలు తొలగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సార్వత్రిక ఎన్నికల సమయం నాటికి 643 కాలనీలకు గాను సుమారు 58వ కాలనీల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసింది. మిగతా వాటిల్లో పూర్తి చేయాల్సి ఉంది. చంద్రబాబు ప్రభుత్వం పేదలకు పేదల ఇళ్లకు ఒక్కపైసా విదల్చలేదు. మౌలిక సదుపాయాల కల్పనపై సైతం దృష్టిసారించలేదు. ఇళ్లు కట్టుకోలేదన్న సాకుతో విద్యుత్ పరికరాలు తొలగిస్తుండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంతో..**

కాలనీల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి పలు కాలనీల్లో విద్యుత్ కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయ్యాయి. దీనిపై అధికారులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశామని చెబుతుంటే అలాంటి ఫిర్యాదులు ఏమీ రాలేదని పోలీసులు చెబుతుండడం గమనార్హం. యధారాజా తథా ప్రజ అన్న చందంగా లేఅవుట్లను నిర్వీర్యం చేయటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పెద్దలు, అధికారులు కంకణం కట్టుకున్నారని, ఇది సరికాదని పలు కాలనీల్లో ప్రజలు మండిపడుతున్నారు.

**మా సొంత ఇంటి కల నెరవేరేట్టు లేదు**



గత ప్రభుత్వంలో మాకు జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం, కాలనీ మంజూరు చేశారు. మేము నిరుపేద వ్యవసాయ కూలీలం, జగనన్న ప్రభుత్వంలో కాలనీ మంజూరు కావడంతో ఎంతో ఆనంద పడ్డాం. మేము పేదలం కావడంతో ఇల్లు కట్టుకోవడంలో ఆలస్యమైంది. ఇంతలో ఎన్నికలు రావడంతో నిధులు నిలిచి పోయాయి. సొంతగా ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక మాకిచ్చిన ప్లాట్‌లో ఇల్లు కట్టుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక జగనన్న కాలనీల్లో ఎటువంటి పురోగతి లేదు. కాలనీలో గత ప్రభుత్వం రోడ్లు, కాలువలు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కొంత మేర ఏర్పాటు చేశారు. అయితే తాజాగా విద్యుత్ అధికారులు గుమ్మనంపాడు జగనన్న లే అవుట్‌లోని విద్యుత్ పోల్స్, కండక్టర్స్, ఐరన్ ఇన్సులేటర్స్ తొలగించి తీసుకెళ్తున్నారు. దీంతో మా లాంటి పేదలకు సొంత ఇంటి కల ఇక కలగా మిగిలినట్లే.

– జీ నయోమి, పామూరు మండలం గుమ్మనం పాడు

**విద్యుత్ సరఫరా తీసేస్తే.. ఇల్లు కట్టుకునేదెలా..**



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ పార్టీలకు అతీతంగా జగనన్న లేవుట్‌లో ఇంటి స్థలం, కాలనీ మంజూరు చేశారు. అయితే ఎన్నికలు రావడంతో ప్రభుత్వ నిధులు కూడా మంజూరు చేయలేదు. ఆర్థిక సమస్యల కారణంగా, ఇల్లు నిర్మించుకునే స్తోమత లేక కొంత జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వ వచ్చాక జగనన్న లే అవుట్లలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదు. పైగా లే అవుట్లలో గత ప్రభుత్వం కల్పించిన విద్యుత్ లైన్‌ను తొలగిస్తున్నారు. దీంతో ఇల్లు ఎలా కట్టుకుంటాం. ఇది సరైంది కాదు. పేదలకు ఇబ్బంది పెట్టినట్లే.

– జీ ప్రమీల, పామూరు మండలం, ఎస్సీ కాలనీ

**కనీస సమాచారం ఇవ్వకుండా తొలగించడం సరైంది కాదు**



జగనన్న లేవుట్ కాలనీల్లో కనీస సమాచారం లేకుండా విద్యుత్ స్తంభాల తీగలను తొలగించడం సరైంది కాదు. ఇప్పటికే పామూరు మండలం గుమ్మనంపాడు, వగ్గంపల్లి దగ్గర మరో లే అవుట్‌లోని విద్యుత్ సరఫరాను తొలగిస్తున్నారు. జగనన్న లేఅవుట్‌లలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చాక అధికారులు కుంటి సాకులతో విద్యుత్ లైన్‌ను తొలగించడం ఎంతవరకు సబబు. కనీసం లబ్ధిదారులకు సమాచారం కూడా ఇవ్వలేదు. పేద వర్గాలు కాలనీ నిర్మించుకోవాలంటే విద్యుత్ లేకుండా చేస్తే ఎలా..? ప్రభుత్వం, అధికారులు దీనిపై పునరాలోచించాలి.

– పందిటి మోహన్, దళిత హక్కుల వేది జిల్లా ప్రధాన కార్యదర్శి

# ఎమ్మెల్యే అరాచకాలపై ధర్నాకు సిద్ధం

- వెలుగొండ, మెడికల్ కాలేజి, జిల్లా కేంద్రం ఏర్పాటుపై చర్చకు సిద్ధం
- కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందని ప్రజలు చెప్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన పార్టీ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం ఎమ్మెల్యే అరాచకాలపై త్వరలో ఒంగోలులో ధర్నా చేస్తామని, వెలుగొండ ప్రాజెక్టు, మెడికల్ కాలేజి, జిల్లా కేంద్రంగా మార్కాపురం ఏర్పాటుపై ఎవరితోనైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని తేదీ, సమయం, స్థలం చెపితే చాలని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్ ఆర్ సీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాయవరం వద్ద ఉన్న మెడికల్ కాలేజి వద్ద పీపీపీ వద్దు, ప్రభుత్వం మెడికల్ కాలేజిని నడపాలని నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇందుకు కౌంటర్‌గా 21న మార్కాపురం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే వైఎస్సార్ సీపీ వాళ్లు అడ్డుకుంటున్నారని వాడు, వీడు అని నోరుపారేసుకుని మాట్లాడారన్నారు. అధికారం ఉందని నోరు పారేసుకోవద్దని, మాకు నోరుంది మేము అనలేక కాదు మాకు సభ్యత ఉందికాబట్టే మాట్లాడటం లేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తెచ్చిందని, 2023లో 5 కాలేజీలను ప్రారంభించారన్నారు. గత సంవత్సరం 2 కాలేజీలు పూర్తయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అడ్మిషన్‌లు చేయకుండా అనాసక్తత చూపుతూ నిలుపుదల చేశారన్నారు. మెడికల్ కాలేజీని ప్రభుత్వం నిర్వహిస్తే పేద విద్యార్థులకు ఉపయోగమా, ప్రైవేటు యాజమాన్యం నిర్వహిస్తే ఉపయోగమా అనేది ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. పీపీపీ విధానంలో కేవలం 33 ఏళ్లు మాత్రమే నిర్వహిస్తారని, అనంతరం ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పటం ప్రజలకు అర్థం కాదా అని ప్రశ్నించారు. కాలేజీని నిబంధనల ప్రకారం 66 సంవత్సరాలు పీపీపీ విధానం కింద ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని కూటమి ఎమ్మెల్యే తెలుసుకోవాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టుపై ఏ ప్రభుత్వ కాలంలో ఎంత ఖర్చు పెట్టింది కాగ్ నివేదికలు పేర్కొంటున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు మంచి పరిపాలన అందిస్తుందని ప్రజలు చెప్తే బేషరతుగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. ఈ నియోజకవర్గంలో గత 15 నెలలుగా ఇసుక దోపిడీ, మట్టి దోపిడీ, మద్యం దోపిడీ, బియ్యం దోపిడీ, ల్యాండ్ దోపిడీలు జరుగుతుంటే మీరెందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. మార్కాపురం నియోజకవర్గ ప్రజలు రెండు సార్లు మిమ్మల్ని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, మీరు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండన్నారు. అంతే కానీ నోరుందని పారేసుకుంటే ఫలితం ఉండదన్నారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ కార్పొరేషన్ బోర్డు మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ జీ.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్‌లు డాక్టర్ కనకదుర్గ, ఎం.శ్రీనివాసులు, సలీం, చంద్ర, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, డాక్టర్ మగ్బుల్‌బాషా, నజీర్, నాయకులు పీ.చెంచిరెడ్డి, జీ.సత్యనారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, గుంటక చెన్నారెడ్డి, ఉత్తమ్‌కుమార్, నాలీ కొండయ్య యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశ చూపి టోకరా!

- వేలల్లో పెట్టుబడి పెట్టండి.. లక్షాధికారులు కండి
- ఎల్ఎఫ్ వర్క్ మనీ యాప్ పేరుతో రూ.5 కోట్లు వసూలు
- నిర్వాహకుడు ఊరి విడిచి వెళ్లడంతో మోసం వెలుగులోకి



మోసాలకు కారణమైన యాప్

నాగులుప్పలపాడు: మీరు కొంత డబ్బు చెల్లిస్తే రోజు వారీగా మీ బ్యాంకు ఖాతాలో మేము కొంత జమ చేస్తాం. వాటిని మీ అవసరాలకు మీ వద్ద ఉన్న యాప్ ద్వారా వారంలో మూడు రోజుల పాటు ఆ డబ్బును డ్రా చేసుకోవచ్చు. అంతే కాకుండా మీరు కొత్త వారిని మన వ్యాపారంలోకి చేరిస్తే వారి చేరిక ద్వారా వచ్చే కమీషన్ వెంటనే మీ ఖాతాలో జమ చేస్తాం. డబ్బు సంపాదించడానికి ఇంతకు మించిన మంచి తరుణం లేదంటూ ఆ ఊరి ప్రజలను నమ్మించి వంచించాడో ప్రబుద్ధుడు. నిజమేనని నమ్మిన గ్రామస్తులు ఈ యాప్ ద్వారా సుమారు 500 మందికి పైగానే రూ.5 కోట్లకు పైగా చెల్లించి తిరిగి చెల్లింపులు లేకపోవడంతో పాటు ఈ యాప్ అలవాటు చేసిన వ్యక్తి ఊర్లో కనిపించకపోవడంతో మోసపోయామని గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాగులుప్పలపాడు మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన తూతిక నాగాంజనేయులు అనే వ్యక్తి ఎల్ఎఫ్ వర్క్ మనీ పేరుతో ఉన్న యాప్ ద్వారా డబ్బులు పెట్టుబడి పెడితే లక్షల్లో లాభాలు వస్తాయని గ్రామస్తులకు ఆశ చూపించాడు. గ్రామంలోనే సుమారు 500 మంది నుంచి రూ.5 కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసి అందులో చేర్పించాడు. ఈ ఎల్ఎఫ్ వర్క్ యాప్‌ను ఈ ఏడాది జనవరిలో నాగాంజనేయులుకు ఒడిశాకు చెందిన కొందరు వ్యక్తులు పరిచయం చేశారు. రూ.2400 డిపాజిట్ చేస్తే రోజుకి రూ.72 చొప్పున 9 నెలలు తిరిగి ఇస్తారు, రూ.6 వేలకు రోజుకి రూ.350 చొప్పున 9 నెలలు, రూ.12 వేలు చెల్లిస్తే రోజుకి రూ.725 చొప్పున 9 నెలలు ఇస్తామని చెప్పి ప్రజలకు అలవాటు చేసి మొదట్లో తిరిగి చెల్లింపులు కూడా చేశారు. అనంతరం ఆశావాహులు పెరిగారని నమ్మకం కుదిరిన తరువాత రూ.24 వేలు, రూ.51,100 లాంటి పెద్ద మొత్తాలను కూడా డిపాజిట్ చేయొచ్చని నమ్మబలికారు. ఎల్ఎఫ్ వర్కు పేరుతో చీరాల, ఇంకొల్లు ప్రాంతాల్లో కార్యాలయాలు కూడా తెరిచారు. దీనికి ప్రజలను బాగా అలవాటు చేయడానికి ఈ మధ్య కాలంలో చీరాలలోని ఓ రిసార్టులో హంగు, ఆర్భాటాలతో ఓ పెద్ద అవగాహన సభ ఏర్పాటు చేయడంతో పాటు వచ్చిన క్లైంట్లకు భారీ విందు కూడా ఇచ్చారు. దీనిని నమ్మిన జనం ఆగస్టు చివరి వారం, సెప్టెంబర్ మొదటి వారాల్లో అందిన కాడికి అప్పులు తెచ్చి కోట్లలో పెట్టుబడులు పెట్టారు. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన తూతిక నాగాంజనేయులు ఈ సంస్థకు చీరాల ఏరియా మేనేజర్‌ని అని తనకు తానుగా పరిచయం చేసుకోవడంతో తిమ్మసముద్రం గ్రామంతో పాటు చీరాల, వేటపాలెం, పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల ప్రజలు తమ బంగారాలను సైతం తాకట్టు పెట్టి ఈ యాప్ లో పెద్ద మొత్తంలో జమ చేశారు. అయితే ఈనెల 13వ తేదీ నుంచి యాప్ ద్వారా రోజువారీగా వచ్చే డబ్బులు విత్‌డ్రా చేయడానికి రావడం లేదు. ఈ వ్యవహారం మొత్తానికి కారణమైన నాగాంజనేయులు ఊరి విడిచి వెళ్లిపోవడంతో పాటు 2 రోజుల నుంచి అతని ఫోన్ పనిచేయకపోవడంతో గ్రామంలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం గ్రామంలో పోలీసులు విచారణ చేపట్టారు.

**రూ.51 వేలు జమ చేశా..**

బర్లీ పొగాకు వలన పూర్తిగా నష్టపోయిన తరుణంలో గ్రామంలో ఈ యాప్ ద్వారా ఎక్కువ మంది డబ్బులు సంపాదిస్తున్నారన్న సమాచారంతో అప్పు చేసి మరీ మా గ్రామానికి చెందిన యువకుడి ద్వారా రూ.51 వేలు జమ చేశాను. తీరా అసలు చూస్తే యాప్ ద్వారా మోసం జరిగిందని గ్రహించాం.

– దేశబోయిన వెంకట్రావు, బాధితుడు

**నాతో పాటు, నేను చేర్పించిన వారూ నష్టపోయాం..**

యాప్ ద్వారా డబ్బులు వస్తున్నాయన్న ఆశతో నేను స్వయంగా రూ.2.60 లక్షల పెట్టుబడి పెట్టడంతో పాటు నాకు తెలిసిన వారి ద్వారా మరో రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టించాను. చివరికి మోసపోయాం.

– మాగులూరి రత్తయ్య, బాధితుడు

## హంసవాహనంపై బ్రహ్మచారిణిగా..



త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన త్రిపురాంతకంలో బాలా త్రిపురసుందరీ దేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో హంస వాహనంపై దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బుదవారం చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్ర వాహనంపై ఉత్సవం జరగనుంది.

హంసవాహనంపై బ్రహ్మచారిణి అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవి

## చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలి

- విద్యతో పాటు వాళ్ల ఆరోగ్యంపైనా సమాన దృష్టి పెట్టాలి
- విద్యాశాఖ అధికారులతో సమీక్షలో కలెక్టర్ పీ.రాజాబాబు

ఒంగోలు సబర్బన్: చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. జిల్లాలో పాఠశాల, జూనియర్ కళాశాలల స్థితిగతులు, విద్యాసంబంధ విషయాలపై మంగళవారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేకంగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు చిన్నారుల ఆరోగ్యంపై సమాన దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విద్య, వైద్యం, ప్రజలకు తాగునీరు తన ప్రాధాన్యత అంశాలని ఆయన పునరుద్ఘాటించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జిల్లాలో వివిధ కేటగిరీల వారీగా ఉన్న పాఠశాలలు, కళాశాల వివరాలను డీఈవో ఏ.కిరణ్ కుమార్, ఆర్ఐఓ ఆంజనేయులు కలెక్టరుకు వివరించారు. పై తరగతులకు విద్యార్థులు ప్రమోట్ అవుతున్న, చేరుతున్న తీరును, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు, తల్లికి వందనం పథకాలు, విద్యాహక్కు చట్టం అమలవుతున్న తీరును వారు తెలియజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఆరోగ్య పరిస్థితిని, ముఖ్యంగా బాలికలు ఏ విధంగా మెరుగుపరచుకోవాలో టీచర్ల చేత ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ విద్యాధికారులు, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కర్ బాబు, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు, పలువురు ఎంఈఓలు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వీడండి.. సమస్యలు పరిష్కరించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

- అర్జీదారులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- అధికారులకు కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక

ఒంగోలు సబర్బన్:

సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులతో అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ పి.రాజాబాబు హెచ్చరించారు. ఉద్యోగులు, అధికారులు ఇష్టారీతిగా ప్రవర్తిస్తే ఊరుకోబోనని స్పష్టం చేశారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్‌ఓ బి.చిన ఓబులేసుతో కలిసి మండల స్థాయి అధికారులతో రెవెన్యూ సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'కోరుకున్న చోటకు పోస్టింగ్ వచ్చింది కదా.. ఇక పరవాలేదులే' అనుకుని ప్రజలతో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే ఉపేక్షించేది లేదన్నారు. సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని దిశానిర్దేశం చేశారు. 'మీకోసం' కార్యక్రమానికి వస్తున్న అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత అంశాలవే ఉంటున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లాలోని అధికార యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్న టాప్-10 అంశాలకు సంబంధించిన పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రజలు ప్రస్తావించిన, మీడియాలో వస్తున్న సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధనకే యూటీఎఫ్ రణభేరి

- ఉపాధ్యాయుల సమస్యలపై కూటమి ప్రభుత్వ స్పందన శూన్యం
- ఐఆర్ ఇవ్వకపోగా పీఆర్‌సీ నూతన కమిటీ ఏర్పాటుపై తాత్సారం
- రేపు గుంటూరులో రణభేరికి తరలి రావాలని యూటీఎఫ్ నేతల పిలుపు

ఒంగోలు సిటీ:

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. కూటమి పార్టీలు అధికారం చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25న గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల్లో సభ్యులందరూ భారీగా తరలివచ్చి ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని కోరారు. విద్యారంగ సమస్యలను ఒక్కటి కూడా పరిష్కరించకపోగా ఉపాధ్యాయులలో బోధనేతర పనులు చేయించడం సరికాదని పేర్కొన్నారు. పిల్లలకు పాఠాలు బోధించడం వరకే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను ఏళ్ల తరబడి చెల్లించపోవడం వల్ల ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అధికారం చేపట్టగానే పీఆర్సీ కమిషన్ సభ్యులు రాజీనామా చేశారని, ఇంత వరకు నూతన కమిషన్‌ను నియమించకపోగా, ఐఆర్ కూడా ప్రకటించకపోవడం సరైనాదేనా అని ప్రశ్నించారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును సైతం చెల్లించకపోవడాన్ని ఆక్షేపించారు. పై అంశాలపై ప్రభుత్వ అధికారులకు అనేకమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందించలేదని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులందరితో కలిసి యూటీఎఫ్ రణభేరి మోగిస్తోందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు ఉపాధ్యాయులను చైతన్యపరచడంతోపాటు ప్రజానీకానికి కూడా తమ బాధను తెలియజేశామన్నారు. ప్రభుత్వం ఇదే తీరును కొనసాగిస్తే భవిష్యత్తులో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# స్టడీ సర్కిల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్కో సంక్షేమ పథకం నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. సంక్షేమ పథకాల సంగతి అటుంచితే విద్యార్థులు, నిరుద్యోగుల కోసం పని చేస్తున్న సంక్షేమ పథకం ఒక్కటీ లేదు. ముఖ్యంగా జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ పనితీరు మరింత దారుణంగా ఉంది. పోటీ పరీక్షలకు శిక్షణ అక్కడ మచ్చుకైనా కనిపించడం లేదు. ఏడాదిలో రెండు నెలలు శిక్షణ ఇవ్వడం కూడా అక్కడ గగనంగా మారుతోంది. నిరుద్యోగులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తూ వేలాది రూపాయలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.



బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం

- కూటమి ప్రభుత్వంలో పోటీ పరీక్షలకు శిక్షణ కరువు
- పేరుకే బీసీ స్టడీ సర్కిల్.. ఏడాదిలో రెండు నెలలే శిక్షణ
- సిబ్బంది జీతభత్యాలకే ఏడాదికి అక్షరాలా రూ.10 లక్షలు

ఒంగోలు వన్‌టౌన్:

కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు శిక్షణ కరువైంది. పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు పోటీ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ ఇచ్చి వారిని ఉద్యోగులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆచరణలో నామమాత్రంగా పనిచేస్తోంది. ప్రస్తుత సంవత్సరంలో కేవలం డీఎస్సీకి మాత్రమే అధికారులు రెండు నెలల పాటు శిక్షణ ఇప్పించి చేతులు దులుపుకున్నారు. బీసీ స్టడీ సర్కిల్ సిబ్బంది వేతనాలు, కార్యాలయం నిర్వహణకు సంవత్సరానికి లక్షలు వెచ్చిస్తున్నా ఆశించిన స్థాయిలో నిరుద్యోగులకు శిక్షణ అందడం లేదు. దీంతో నిరుద్యోగులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లను ఆశ్రయిస్తూ వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. అసలు బీసీ స్టడీ సర్కిల్ అనే సంస్థ ఒంగోలులో ఉంది అనే విషయం చాలా మంది నిరుద్యోగులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. బీసీ స్టడీ సర్కిల్‌పై అవగాహన కల్పించాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు. ఒంగోలులో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భవనాల సముదాయం వెనుక వైపు బీసీ స్టడీ సర్కిల్‌ను గతంలో ఏర్పాటు చేశారు.

ఈ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఆ వాతావరణం అక్కడ మచ్చుకైనా కనిపించదు. సంవత్సరంలో ఏదో ఒక శిక్షణను రెండు నెలల పాటు ఇప్పించి మిన్నకుండిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే జాబ్ నోటిఫికేషన్‌లకు అనుగుణంగా బీసీ స్టడీ సర్కిల్లో ఉచితంగా శిక్షణ అందిస్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నర కాలంలో కేవలం డీఎస్సీకి మాత్రమే శిక్షణ ఇచ్చారు. ఇతర ఎటువంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చింది లేదు. బీసీ స్టడీ సర్కిల్లో బీసీలకు 66, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 శాతం మేర సీట్లు కేటాయించి శిక్షణ అందిస్తుంటారు. వీరితో పాటూ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా సీట్లు కేటాయించే అవకాశం ఉంటుంది. 200 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. కోచింగ్ సమయంలో అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైఫండ్, మెటీరియల్‌కు రూ.1000 అందిస్తారు. 75 శాతం హాజరు ఉన్న వారికి స్టైఫండ్ ఇస్తారు. అభ్యర్థులను స్క్రీనింగ్ టెస్టు ద్వారా ఎంపిక చేస్తారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈ స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలి.

## ఆఫ్‌లైన్..ఆన్‌లైన్ శిక్షణ

ఆఫ్ లైన్, ఆన్‌లైన్ ద్వారా రెండు పద్ధతుల్లో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించాల్సి ఉండగా ఒంగోలు బీసీ స్టడీ సర్కిల్లో కేవలం ఆఫ్‌లైన్‌లోనే శిక్షణ అందిస్తున్నారు. ఆన్‌లైన్‌లో శిక్షణను అందించేందుకు ఏర్పాట్లు లేవు. డీఎస్సీకి 200 మంది వరకు శిక్షణకు అవకాశం ఉండగా కేవలం 125 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 75 మంది లోపు మాత్రమే ఉచిత శిక్షణకు హాజరయ్యారు. వీరిలో కూడా చాలా మంది మధ్యలోనే మానేశారు.

## నైపుణ్యం లేని శిక్షణ

సుశిక్షితులైన ఫ్యాకల్టీతో, సీనియర్‌లతో కోచింగ్ ఇవ్వాల్సి ఉండగా నామ మాత్రంగా జూనియర్లతో కోచింగ్ ఇప్పిస్తున్నారు. నాణ్యమైన శిక్షణ అందకపోవడంతో అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్‌కు రావడం లేదు. ఒక్కో ఫ్యాకల్టీకి సబ్జెక్టు గంటన్నరకు రూ.600 చొప్పున చెల్లిస్తున్నారు. అభ్యర్థులు నూతన విషయాలు తెలుసుకునేందుకు, నేర్చుకునేందుకు ఉద్దేశించిన లైబ్రరీలో నూతన పుస్తకాలు ఉండటం లేదు. ఎప్పటివో పాత పుస్తకాలతోనే నెట్టుకొస్తున్నారు. కరెంట్ ఎఫైర్స్ పుస్తకాలు ఎప్పటికప్పుడు కొనుగోలు చేయడం లేదు. బీసీ స్టడీ సర్కిల్లో కోఆర్డినేటర్, లైబ్రేరియన్, అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించారు. వీరి జీత భత్యాలకే సంవత్సరానికి దాదాపు రూ.10 లక్షల వరకూ వెచ్చిస్తున్నా ఆశించిన పురోగతి కనిపించడం లేదు.

> **అవసరమైన శిక్షణ ఇస్తాం:**
> బదిలీపై నూతనంగా జిల్లాకు వచ్చా. బీసీ స్టడీ సర్కిల్లో ఇతర శిక్షణలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. మెగా డీఎస్సీలో బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ పొందిన వారిలో ఏడుగురు అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చాయి.
> – నిర్మలాజ్యోతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి

# వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయాలి

- 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంతో ముందుకు సాగాలి
- వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్షలో కలెక్టర్ రాజాబాబు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా చేయడమే లక్ష్యంగా సంబంధిత అధికారులు పనిచేయాలని కలెక్టర్ పీ రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖలైన హార్టీకల్చర్, పశుసంవర్ధక, మైక్రో ఇరిగేషన్, సహకార, ప్రకృతి వ్యవసాయం, మత్స్య శాఖల అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 15 శాతం వృద్ధిరేటే లక్ష్యంతో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుకూలంగా ఉండి నిరుపయోగంగా ఉన్న భూమిని సాగులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దానికనుగుణంగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి రైతుకు ఖర్చు తగ్గించి ఉత్పత్తి పెంచేలా, అధిక ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రైతుల అవసరాలకు అనువైన యంత్రాలను గుర్తించాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలోని మూడు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఆ మండలాల్లో రైతుల అవసరాలను గుర్తించి మంచి ఫలితాలు సాధించేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.06 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం అమలు చేస్తుండగా, మరో 1.01 లక్షల హెక్టార్లలో అమలు చేసేందుకు అవకాశం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రానున్న 2, 3 సంవత్సరాల్లో లక్ష హెక్టార్లలో సూక్ష్మ సేద్యం విధానాన్ని అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు తయారుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పశుగ్రాసం పంపిణీ, పశు బీమా లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన లక్ష్యాలకు వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన వృద్ధి రేటు సాధించేలా మత్స్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస రావు, పశుసంవర్ధక శాఖ జేడీ రవి కుమార్, మత్స్య శాఖ జేడీ శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ సుభాషిణి, మార్క్‌ఫెడ్ అధికారి శ్రీహరి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాస రావు, జిల్లా సెరీకల్చర్ అధికారి సుజయ్, జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపిచంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అసభ్యకరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఒంగోలు సిటీ: ప్రజలు, ప్రజా ప్రతినిధులపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారంగా ఇతరులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం, వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగామ్ వాల్‌పై అసభ్యంగా వ్యాఖ్యానిస్తున్న వారిపై దృష్టి సారించామని తెలిపారు. మహిళలు, ఇతరులను కించపరిచే రీతిలో వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, కులం-మతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమాజాన్ని కలవరపెట్టేలా కాకుండా, వాస్తవాలను తెలుసుకున్న తర్వాతనే సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ చేయాలని ప్రజలకు సూచించారు. యువత సోషల్ మీడియాను మంచి కోసమే వినియోగించుకోవాలని సూచించారు.



# నీళ్ల బాధలు.. ఇంకెన్నాళ్లు?

- రామతీర్థం వద్ద సాగర్ కెనాల్‌కు పడిన గండిని పూడ్చాలి
- మధుకాన్ గ్రానైట్ సంస్థ కుట్రలతోనే పనులకు అడ్డంకి
- 20 గ్రామాల ప్రజలు, రైతుల ఇబ్బందులు పరిష్కరించరా?
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో కారుమంచి మేజర్ కెనాల్ రైతుల ఆగ్రహం



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న కారుమంచి కెనాల్ ఆయకట్టు రైతులు

ఒంగోలు సబర్బన్: ఎన్‌ఎస్‌పీ కారుమంచి మేజర్ కాలువకు పడిన గండిని వెంటనే పూడ్చాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆయకట్టు కమిటీ నీటి సంఘం అధ్యక్షుడు పాలడుగు వెంకట నారాయణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఆయకట్టు కమిటీ నీటి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. రామతీర్థం జలాశయం నుంచి సరఫరా అయ్యే సాగర్ నీరు చీమకుర్తి, సంతనూతలపాడు, టంగుటూరు మండలాలకు సక్రమంగా అందడం లేదన్నారు. దాదాపు 20 గ్రామాల ప్రజలకు నీరందించే కారుమంచి మేజర్ కెనాల్‌కు 2019లో చీమకుర్తిలోని మధుకాన్ గ్రానైట్ క్వారీ వెనుక భాగంలో భారీ గండి పడిందన్నారు. 18 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ కెనాల్‌లో గండి పడినప్పటి నుంచి 130 క్యూసెక్కులకు బదులు కేవలం 40 క్యూసెక్కుల నీరే ప్రవహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గండి పడిన ప్రదేశం పక్క నుంచి తాత్కాలికంగా కాలువ ఏర్పాటు చేశారని, 40 క్యూసెక్కుల ప్రవాహం తొలి మూడు గ్రామాలకు కూడా సరిపోవడం లేదన్నారు. ఇక చివరి గ్రామాల ప్రజలు గొంతు తడుపుకోవడానికి కూడా నీరు అందడం లేదని చెప్పారు. కాలువ గండి పూడ్చేందుకు ప్రభుత్వం ఏపీడీఎంఎఫ్ నిధులు రూ.2.63 కోట్లు మంజూరు చేసినప్పటికీ నిర్మాణ పనులను మధుకాన్ గ్రానైట్ కంపెనీ యాజమాన్యం అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కాలువ కింద ఉన్న గ్రానైట్ నిక్షేపాల కోసమే మధుకాన్ సంస్థ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కాలువ స్థలాన్ని తమకు కేటాయిస్తే ల్యాండ్ రిక్రూట్మెంట్ ద్వారా కొంచెం ముందు నుంచి కాలువ తీస్తామనడాన్ని తప్పుబట్టారు. నీరు పల్లం నుంచి మెరకకు ఎక్కవన్న సంగతి మధుకాన్ యాజమాన్యం గుర్తుంచుకోవాలన్నారు. పాత డిజైన్ ప్రకారం కాలువ నిర్మిస్తేనే 20 గ్రామాల్లో ఉన్న ఆయకట్టు భూములకు నీరు అందుతాయని తేల్చిచెప్పారు. సాగు నీరు అందక రైతులు ఇప్పటికే చాలా నష్టపోయారన్నారు. 10 మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులకు సక్రమంగా నీరు సరఫరా కాక ప్రజలతోపాటు పశువులకు తాగునీటి కోసం విలవిల్లాడాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ గండి పూడ్చకుండా అడ్డుతగులుతున్న మధుకాన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబుకు వినతి పత్రం అందజేశారు.

# ఫైసలిస్తేనే పని.. ప్రత్యర్థులకు వేధింపులు!

- స్వగ్రామానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ రాజకీయాలు చేస్తున్న వీఆర్‌ఓ బాలేశ్వరరావు
- టీడీపీ నేతల అండతో గ్రామస్తులను ముప్పతిప్పలు పెడుతున్నట్లు ఆరోపణలు
- రెగ్యులర్ వీఆర్వోను నియమించాలని కొలుకుల గ్రామస్తులు వినతి

యర్రగొండపాలెం: ప్రభుత్వం కొలువు కేటాయించిన పంచాయతీని కాదని ఒక వీఆర్వో తన స్వగ్రామంలో పెత్తనం చెలాయిస్తున్న ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దరిమిలా సదరు వీఆర్వో స్వగ్రామమైన కొలుకులలో నియోజకవర్గ పచ్చ నేత అండదండలతో రాజకీయాలకు తెరతీసినట్లు స్థానికులు కోడై కూస్తున్నారు. ప్రభుత్వ అధికారిగా ప్రజలందరినీ సమాన దృష్టితో చూస్తూ సేవలు అందించాల్సింది పోయి.. ఓ వర్గాన్ని రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తూ ముప్పుతిప్పలు పెడుతుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది. వీఆర్వో తీరుపై 3 నెలల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు.. పైపాలెం మండలంలోని గంగపాలెం పంచాయతీలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న కర్రె బాలేశ్వరరావు తన స్వగ్రామమైన కొలుకుల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. రెవెన్యూ పరంగా ఆ గ్రామంలోని ఒక వర్గీయులకు మాత్రమే కొమ్ముకాస్తూ.. మరో వర్గానికి చెందినవారిపై వివక్ష చూపడం చర్చకు దారితీసింది. తమను రాజకీయంగా ప్రత్యర్థి వర్గంగా భావిస్తూ.. పనులు చేయడానికి డబ్బు డిమాండ్ చేస్తున్నాడని, తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. యర్రగొండపాలెంలో నివాసం ఉంటూ ఉదయం గంగపాలెం వెళ్లి సచివాలయంలో థంబ్ వేసి, అటు నుంచి కొలుకులకు చేరి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. స్వగ్రామంలో రాజకీయంగా ఎదిగేందుకు అధికారాన్ని అడ్డుపెట్టుకొని కుయుక్తులు పన్నుతున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 14న జరిగిన నీటి సంఘం ఎన్నికల్లో ప్రత్యర్థి వర్గీయులు నామినేషన్ వేయనీయకుండా చేసి, తన వదినను అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యేలా కుట్రలు పన్నాడని, వీఆర్వో వదిన పేరుపై సాగుభూమి లేకపోయినప్పటికీ తప్పుడు సర్వే నంబర్‌తో నామినేషన్‌కు అర్హురాలిగా ప్రకటించుకున్నాడని ఆరోపించారు. ఆ ఎన్నికల్లో ఎవరు పోటీపడకుండా ఏకంగా ఆ చెరువు కింద సాగుచేసుకుంటున్న రైతుల ఓట్లను తొలగించాడని నాటి సంఘటనలను గుర్తు చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుటుంబీకులను పోటీ చేయించేందుకు వీఆర్వో సిద్ధమవుతున్నట్లు సమాచారం. వీఆర్వో స్వగ్రామంలో చేస్తున్న అరాచకాలపై ఈ ఏడాది జూన్ నెలలో అప్పటి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని ఆయన బాధితులు ఎం.యల్లయ్య, డి.వెంకటేశ్వర్లు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ స్పందించి వీఆర్వో బాలేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని, ఆయన స్థానంలో రెగ్యులర్ వీఆర్వోను నియమించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో తెగిపడిన చిన్నారి కాలు



చిన్నారితో పాటు తెగిన కాలును ఆస్పత్రికి తరలిస్తున్న బంధువులు

అర్ధవీడు: బొలెరో వాహనం ఎక్కడంతో ఓ చిన్నారి కాలు రెండు ముక్కలుగా తెగిపడింది. ఈ సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గన్నెపల్లిలో బయట ఆడుకుంటున్న మూడేళ్ల అస్మ కాలిపై పత్తి లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం ఎక్కింది. చిన్నారి కాలు రెండు ముక్కలకు విడిపోవడం స్థానికులను కంటతడి పెట్టించింది. ప్రమాదంలో చిన్నారి ఎడమ కాలు పూర్తిగా వేరైంది. చిన్నారిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స చేశారు. అనంతరం గుంటూరు వైద్యశాలకు తీసుకెళ్లారని ఎస్సై శివ నాంచారయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.